పన్నులు సకాలంలో చెల్లించాలి

ఖానాపూర్, ఫిబ్రవరి 20: పట్టణ ప్రజలు తమ ఇంటి, వ్యాపార పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టీ మనోహర్ కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భాగంగా మార్చి 31లోపు బకాయిలతో సహా చెల్లించాలని సూచించారు. మార్చి 31 తర్వాత వడ్డీ చెడల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 12 వార్డులకు గాను మున్సిపల్ అధికారులు బృందాలుగా ఏర్పడి పన్నులు వసూలు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు, వ్యాపారులు పన్నులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేయరాదని, చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నర్సరీ పరిశీలన

న్యూ లోలంలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 20: మండలంలోని న్యూ లోలం గ్రామంలోని ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీని మంగళవారం తహసీల్దార్(గ్రామప్రత్యేకాధికారి) స్వాతి పరిశీలించారు. గ్రామ పంచాయతీలోని గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. గ్రామంలో సమస్యలుంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి, తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అక్కడి నుంచి గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, హరిత హారం నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. ఆర్ఐ సంతోష్ కుమార్,స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ గోవిందుల మహేశ్, గ్రామస్తులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 20: మండలంలోని సిర్గాపూర్ వద్ద నిర్మల్ భైంసా 61వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(40) మృతి చెందినట్లు ఎస్ఐ సుమాంజలి తెలిపారు. బ్లూకలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, జీన్ ప్యాంట్ వేసుకున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని నిర్మల్ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాసర, ఫిబ్రవరి 20 : బాసర గోదావరి నది మొదటి ఘాట్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. మహిళకు సుమారు 55 ఏండ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. బాసర పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20: మహిళలు, చిన్నారుల సంరక్షణ కోసం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం ఎదుట పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీసీఆర్బీ ఎస్ఐ(భరోసాకేంద్రం ఎస్సై) సుమలత తెలిపారు. మహిళలపై దాడులు, చిన్నారులపై పోక్సో కేసులను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, బాధితులకు పోలీసు శాఖ ద్వారా తక్షణ న్యాయం అందుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

మాట్లాడుతున్నడీపీఎం విజయలక్ష్మి

కుంటాల, ఫిబ్రవరి, 20 : లక్షపతి దీదీ యోజన మహిళలను ఆర్థికంగా, స్వతంత్రంగా మారాలనుకునే మహిళలకు ఉపయోగపడుతుందని ఐకేపీ డీపీఎం విజయలక్ష్మి అన్నారు. ఈ పథకం కింద మహిళలు తమ వ్యాపారాలను ప్రారంభించడానికి ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలనుకునే సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మంగళవారం కల్లూరులో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లోకేశ్వరం, కుంటాల మండల ఏపీఎంలు అంజూబాయి, అశోక్, మల్లేశ్, సీసీలు, వీవోఏలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ దాతకు ఘన సన్మానం

దస్తురాబాద్ : వేణుని సన్మానిస్తున్న హిందూ వాహిని సభ్యులు

దస్తురాబాద్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద హిందూ వాహిని ఫౌండర్స్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రానికి చెందిన శివాజీ విగ్రహ దాత, అన్నదాత ఉపాధ్యాయుడు కోట వేణుకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రూ. లక్షా 18 వేలతో విగ్రహాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు దాత కోట వేణు సూచించారు. హిందూ వాహిని ఫౌండర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మకు బోనాలు

బోనాలతో శోభాయాత్రగా బయల్దేరిన మహిళలు

దస్తురాబాద్, ఫిబ్రవరి 20: మండలంలోని మున్యాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో గత 5 రోజుల నుంచి శ్రీ రేణుకా ఎల్లమ్మ 3వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా కొనసాగుతున్నది. ఉత్సవాల్లో భాగంగా మంగవారం బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలు, గ్రామ వీధుల గుండా జోగుతో, బైండోళ్ల నృత్యాల నడుమ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. అంతకుముందు పుట్ట మన్ను సేకరించడం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు రాజు, కిరణ్, శ్రీనివాస్, సాగర్, శ్రీకాంత్, మధు, శంకర్ గౌడ్, మహిళలు, తదితరులున్నారు.

మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిబంధనల మేరకే పనులు చేయాలి

- కొలతల్లో తేడాలుంటే చర్యలు
- డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసాటౌన్, ఫిబ్రవరి 20 : ఉపాధి హామీ పథకంలో నిబంధనల మేరకే పనులు చేపట్టాలని, కొలతల్లో తేడాలుంటే ఊపేక్షించొమని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. ఎంపీపీ అబ్దుల్ రజాక్ అధ్యక్షతన భైంసా ఎంపీడీవో కార్యాలయంలో 14వ బహిరంగ విచారణ మంగళవారం నిర్వహించారు. 30 గ్రామపంచాయతీలకు సంబంధించిన పనులు, రికార్డులను పరిశీలించారు. ఆయా పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి, ఏడాదిలో నిర్వహించిన ఉపాధి హామీ, పంచాయతీరాజ్ పనులను పరిశీలించారు. పనుల్లో అక్కడక్కడ చిన్న చిన్న తప్పులు దొర్లాయి. వారి నుంచి మొత్తం రూ. 13,849 రికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, గ్రామ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

భైంసా, ఫిబ్రవరి 20 : నేడు పట్టణంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నందు భయ్యా తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ నిర్మించిన ఆలయ షెడ్డును ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. స్థానికులు పాపేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

తానూర్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంతో పాటు బోల్సా గ్రామంలో సీసీ రోడ్డు పనులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్, జడ్పీ వైస్ చైర్మన్ బాశెట్టి సాగరాబాయి, వైస్ ఎంపీపీ జెల్లావార్ చంద్రకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారాయణ రావుపటేల్ మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను నాణ్యతగా నిర్మించాలని సూచించారు. సకాలంలో సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హున్‌గుందే పుండ్లిక్, కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావుపటేల్, ఓంప్రకాశ్ లడ్డా, హంగిర్గా సొసైటీ చైర్మన్ నారాయణ్‌రావుపటేల్, శంకర్‌చంద్రే, సదాశివ్ పటేల్, కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌పటేల్, మాజీ సర్పంచ్ జాదవ్ మాధవ్‌రావుపటేల్, సుదర్శన్‌రెడ్డి, చందులాల్‌పటేల్, మధుపటేల్, దత్తురాంపటేల్, సురేశ్ పటేల్, మౌలాబాయ్, అక్బర్, అంబాదాస్ పవార్, మాజీ సర్పంచులు, పాల్గొన్నారు.

ముధోల్ మండలంలో..

ముధోల్, ఫిబ్రవరి, 20: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులతో రోడ్డుపనుల ప్రారంభానికి స్థానిక ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్‌తో కలిసి భూమిపూజలో పాల్గొన్నారు. స్థానిక నాయకులతో పాటు మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌ను సన్మానించారు. ఎంపీటీసీ భూమేశ్, శ్రీనివాస్, ఎంపీటీసీ సరళ, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, ముధోల్ నాయకులు ఖాలీద్ పటేల్, గోవింద్ పటేల్, తదితరులున్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

రైతులకు అవగాహన కల్పిస్తున్నడ్రీమ్ సొసైటీ ప్రతినిధులు

జీవనోపాధిపై రైతులకు శిక్షణ

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 20: ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో మంగళవారం డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో కూరగాయలు, డెయిరీ రైతులకు జీవనోపాధి పొందడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగాపూర్ బావాపూర్ గ్రామస్తులకు వంకాయ, టమాట మిర్చి, మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ సొసైటీ కో ఆర్డినేటర్ చిన్నయ్య పంట సాగుపై జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి లక్ష్మణ్, రవి, రాందాసు, కార్యదర్శి అక్షిత, గ్రామస్తులు , రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో ప్రతిభ

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20: రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్ ఆన్‌లైన్ పరీక్షల్లో వాసవి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ శెట్టి, శైలజాయ్ సన్ తెలిపారు. పాఠశాలకు చెందిన ఆరుషి రెడ్డి, వీ హన్సిక, జీ ప్రయాణ్ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి నగదు పురస్కారం అందుకున్నారని తెలిపారు. విద్యార్థులను మంగళవారం పాఠశాల డైరెక్టర్ జగదీశ్ రెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

భైంసా, ఫిబ్రవరి, 20 : పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నగేష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో మంచి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ డీఈవో రవీందర్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. నగేశ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో రవీందర్ రెడ్డి

రంజనిలో జగదాంబ జాతర ప్రారంభం

కుభీర్, ఫిబ్రవరి 20: మండలంలోని రంజని గ్రామంలోని జగ దాంబ మాత ఆలయంలో మంగళవారం జాతర ప్రారంభమైంది. ముందుగా ఆలయంలో అమ్మవారికి అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలను పూజారి పండరీ మహారాజ్ జరిపించారు. బుధువారం కబడ్డీ, గురువారం కుస్తీ పోటీలు, శుక్రవారం గ్రామంలో పల్లకీ ఊ రేగింపు, నగర ప్రదక్షిణ (దొంతులు), శనివారం మహా అన్నప్రసా దంతో జాతర ముగుస్తుంది. అన్ని ఏర్పాట్లు చేసినట్లు వీడీసీ అధ్యక్షు డు కోరోల్ల బాలాజీ, ఎంపీటీసీ పంతుల హన్మాండ్లు, పద్మశాలి అనిల్ తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఎంపీడీవోలను సన్మానిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

అధికారులకు సన్మానం

భైంసాటౌన్, ఫిబ్రవరి, 20 : గతంలో ఎంపీడీవోగా పని చేసిన గోపాల కృష్ణా రెడ్డితో పాటు కొత్త ఎంపీడీవో సుధాకర్ రెడ్డిని మండల నాయకులు శాలువా, పూలమాలలతో మంగళవారం సన్మానించారు. ఎంపీడీవో గోపాలకృష్ణా రెడ్డి సేవలను కొనియాడారు. మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కొత్త ఎంపీడీవో చొరవ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రజాక్, వైస్ ఎంపీపీ నర్సారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గజానంద్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, మాజీ సర్పంచ్ దుప్పె గణేశ్, నాయకులు వెంకట్ రెడ్డి, గణేశ్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కుంటాల, ఫిబ్రవరి 20: మండలంలోని లింబా (కే) గ్రామానికి మంజూరై రూ. 7 లక్షల సీసీ రోడ్డ నిర్మాణానికి మంగళవారం కుంటాల మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు సుంకరి మహేందర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సునంద గిరీష్ కుమార్, నాయకులు సట్ల లింగయ్య, గజ్జారాం, తాజా మాజీ సర్పంచ్ మోరే ఆనంద్ రావు, వీడీసీ అధ్యక్షులు సిందే ఆనంద్, శ్రీకర్ రెడ్డి, జంగడి భూమన్న, సాంగి మల్లేష్, గణేష్, చిన్నన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

బీజేపీ విజయ సంకల్ప యాత్ర

కుంటాల, ఫిబ్రవరి, 20 : బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మండలంలోని కల్లూరు జాతీయ రహదారి గుండా మంగళవారం నిర్మల్ బయలుదేరి వెళ్లింది. బీజేపీ సీనియర్ నేత ఎంపీ లక్ష్మణ్ నాయకత్వంలో మండలం చేరుకున్న నాయకులకు పార్టీ మం డల అధ్యక్షుడు గుద్దేటి నర్సయ్య, ఎంపీపీ అప్క గజ్జారాం, పసుల నవీన్, దిగంబర్, తాటి శివ, కే. గజేందర్, జక్కుల గజేందర్, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

స్థిరమైన పనితనంతోనే అవార్డులు

అధికారులను సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్, ఫిబ్రవరి 20: ఎంపీడీవో తిరుమల, ఎంపీవో మహేశ్ స్థిరమైన పనితనం, ప్రకృతివనాల నిర్వహణతో ఉట్నూర్‌కు అవార్డులు పొందగలిగామని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలకు లోబడి ఎంపీడీవోగా తిరుమల విధులు విజయవంతంగా నిర్వహించిందని కొనియాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. అలాగే కొత్తగా వచ్చిన ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎంపీవో లింగయ్యను శాలువాలతో సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో, ఎంపీవోలు మాట్లాడుతూ తమ విధులు నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు రషీద్, ఏపీవో రజినీకాంత్, ఈసీ విజేశ్, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఎంపీడీవో సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, పడగంటి కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఆరోగ్య భద్రత కార్డు కలిగిన వారు), సింగరేణి ఉద్యోగులు, జర్నలిస్టులకు నగదు రహిత శస్త్రచికిత్స అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు కలిగిన వారికి చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9133900098, 9133900054 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పట్నాపూర్‌లో వాలీబాల్ పోటీలు

బోథ్, ఫిబ్రవరి 20 : పట్నాపూర్ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే జట్లు ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా రూ.400 చెల్లించి జట్ల పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సిబ్బందితో సూపరింటెండెంట్ ఉపేందర్

సేవలతోనే గుర్తింపు

ఉట్నూర్, ఫిబ్రవరి19: వైద్య సిబ్బంది చేసిన సేవలతోనే వారికి మంచి గుర్తింపు లభించిందని ఉట్నూర్ దవాఖాన సూపరింటెండెంట్ ఉపేందర్ అన్నారు. మంగళవారం జిల్లా దవాఖానలో ఉద్యోగాలు సాధించి వెళ్తున్న 17 మంది సిబ్బందికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి అనేది సేవకు మారు పేరన్నారు. అటువంటి వృత్తిని ఎంచుకున్న సిబ్బంది రోగులకు మంచి సేవలు చేసి పేరు పొందాలన్నారు. ఈ దవాఖానలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహించి శాశ్వత ఉద్యోగులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. డాక్టర్లు మహేందర్, రాథోడ్ కపిల్, నర్సింగ్ సూపరింటెండెంట్ విమల, సునీత, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డు, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎంఈవో మధుసూదన్

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 20: ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎంఈవో మధుసూదన్ పలు పాఠశాలల్లో తనిఖీ నిర్వహించారు. ఇక్బాల్‌పూర్, తర్లపాడు, పాతతర్లపాడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజన రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్, శాంత కుమార్, రాజశంకర్, తదితరులున్నారు.

సంతను వేరే చోటికి మార్చండి

కుభీర్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే అంగడి (సంత)ని పాత బస్టాండ్(గాంధీ చౌక్)ని మార్చాలని కోరుతూ పలువురు గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్, కుభీర్ జీపీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. కొంత కాలంగా జాంగాం చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు అంగడి నిర్వహిస్తున్నారు. ఈ రహదారి గుండా బస్సులు, ప్రైవేటు వాహనాల రాకపోకల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సంతను గాంధీ చౌరస్తాకు మార్చితే అందరికీ అందుబాటులో ఉంటుందని, పలువురు విజ్ఞప్తి చేశారు. గ్రామానికి చెందిన నాయకులు పండరి, శ్రీనివాస్, శ్రీకాంత్, గాజుల దత్తాత్రి, విలాస్, సాయినాథ్, దేవన్న శేఖర్, తదితరులున్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన

కళాశాలలో చేరాలని అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కుభీర్, ఫిబ్రవరి 20: నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు 10వ తరగతి విద్యార్థులను కోరుతున్నారు. మంగళవారం కుభీర్‌తో పాటు మండలంలోని పల్సి, మాలేగావ్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సొంత భవనం, విశాలమైన తరగతి గదులతో పాటు ప్లేగ్రౌండ్, ఎన్ఎస్ఎస్, ఆహ్లాదకరమైన వాతావరణం, ఉచిత ప్రవేశాలు, పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలతో పాటు సుశిక్షితులైన లెక్చరర్లతో ఉన్నటువంటి కళాశాలను అన్ని విధాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధ్యాపకులు కండ్రాతి సంపత్, శ్రీనివాసరావు, శివరాజ్, లింగయ్య, మహేశ్, గజేందర్, రమేశ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట తోపుడు బండ్లపై మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పట్టణ సీఐ పురుషోత్తం చారికి వినతి పత్రం అందించారు. అనంతరం సంఘ సభ్యులు సీఐని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు రంజిత్ కుమార్, పట్టణాధ్యక్షుడు కత్తి నవీన్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి లింగయ్య, రాజన్న తదితరులున్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవు దినానికి బదులుగా ఏప్రిల్ రెండో శనివారం 13వ తేదీన విద్యాసంస్థలు యథా విధిగా ఉంటాయని వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు

కుంటాల, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మంగళవారం సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుకలను ఫస్టియర్ విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు కళాశాలలో తమ స్వీయ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఉన్నత చదువులపై ఉపాధ్యాయులు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కి సన్మానం

దస్తురాబాద్,ఫిబ్రవరి 20 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌ని మంగళవారం మండల రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. లబ్ధిదారులకు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను అందించాలని డీలర్లకు తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో చింత సత్తయ్య పటేల్, గూడా శేఖర్, సపావట్ శంకర్, వెంకటేశ్వర్ రావు, చెవులమద్ది గంగన్న, జంగిలి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంబి, ఫిబ్రవరి 20 : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ శ్రావణ్ అన్నారు. మంగళవారం నాగాపూర్, మందపల్లి గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ ఊరేగింపు

పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20: నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్‌లో మంగళవారం ముజ్గి మల్లన్న పల్లకీ ఊరేగింపును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాలనీకి చేరుకున్న పల్లకీకి మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికి పల్లకీని దర్శించుకున్నారు. మంజులాపూర్ కాలనీ వాసులు శంకర్ యాదవ్, ఆప్క గజేందర్ యాదవ్ తదితరులున్నారు.